సాక్షి మంచిర్యాల

ఆదివారం । 12 । ఫిబ్రవరి । 2023



వేసవిలో పశుగ్రాసాల సాగు

వేసవిలో గడ్డిజొన్న సాగుతో పశుగ్రాసం కొరతకు చెక్ పెట్టవచ్చు. పశుగ్రాసం సాగుచేసే రైతులకు గడ్డిజొన్నలో ఎస్ఎస్‌జీ రకం విత్తనాలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయి. 8లో▸



సీజన్‌కు ముందే నకిలీ దందా

ఖరీఫ్ సీజన్ ముగియక ముందే నకిలీ పత్తి విత్తనాల దందా ప్రారంభమైంది. ఎవరికీ అనుమానం రాకుండా అక్రమార్కులు ముందస్తు వ్యూహంతో రైతులకు అంటగట్టేందుకు యత్నిస్తున్నారు. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
36.3 /18.2

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం వేడిగా ఉంటుంది. రాత్రి చలి ప్రభావం తగ్గుతుంది. వేకువ జామున మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

మంచిర్యాల మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్‌గా రాజు?

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్‌గా మందమర్రి మున్సిపల్ కమిషనర్ రాజును నియమించినట్లు తెలిసింది. మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ ఎస్.బాలకృష్ణ భార్య జ్యోతి ఈనెల 7న ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. జ్యోతి ఆత్మహత్యకు బాలకృష్ణ కారణమని బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు మంచిర్యాల పోలీసులు కేసు నమోదు చేసి ఈనెల 8న అరెస్టు చేశారు. కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. కమిషనర్‌గా ఎవరికీ ఇన్‌చార్జి ఇవ్వలేదు. జిల్లా కేంద్రం, పెద్ద మున్సిపాలిటీ కావడంతో అభివృద్ధికి ఆటంకం కలిగే అవకాశం ఉంది. దీంతో మందమర్రి మున్సిపల్ కమిషనర్‌ను ఇన్‌చార్జిగా నియమించినట్లు తెలిసింది. అయితే అధికారిక ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది.

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు పెంచాలి

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు పెంచాలని తెలంగాణ ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం(టీజీసీజీటీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి సూచించారు. మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టీజీసీజీటీఏ జిల్లా సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా కాలంలో ఆన్‌లైన్ విధానంలో తరగతులు నిర్వహించిన అధ్యాపకులను అభినందించారు. ప్రాథమిక సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర నాయకత్వం చొరవ చూపుతుందని, అధ్యాపకులు మరింత బాధ్యతాయుతంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతి, కార్యదర్శి కిశోర్‌కుమార్, జోనల్ కార్యదర్శి రాజ్‌కుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి రవికుమార్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మాధవరావు, మాజీ జోనల్ కార్యదర్శి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్ తరగతులు పరిశీలన



మాట్లాడుతున్న శ్రీనివాస్

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఓపెన్ ఇంటర్ తరగతులను రాష్ట్ర ఓపెన్ స్కూల్ పరిశీలకులు శ్రీనివాస్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ అశోక్ శనివారం పరిశీలించారు. విద్యార్థులకు నిర్వహిస్తున్న తరగతులను తనిఖీ చేశారు. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరు కావాలని సూచించారు. అంతకుముందు విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.అంజయ్య, చంద్రయ్య, కృష్ణవేణి, గురుపాదం, రాజాగౌడ్, గణేశ్, చందర్, సుధాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

బుల్లి పిట్ట.. బుజ్జి పిట్ట!

కాలం మారుతోంది.. అభిరుచులు మారుతున్నాయి. పక్షులను పెంచుకోవడం హ్యాబీగా మారుతోంది. ఇప్పుడు ఇళ్లలో ఏ ఆవరణలో చూసినా చిట్టిచిట్టి పక్షులు అలరిస్తున్నాయి.

- వివరాలు 9లో▸

పైరవీ పట్టు.. పోస్టింగ్ కొట్టు!

- సీఐ, ఎస్సైల బదిలీలకు సంకేతాలు
- పోలీసు శాఖలో మొదలైన హడావుడి
- నచ్చిన ఠాణా కోసం ఖాకీల ప్రయత్నాలు
- ప్రజాప్రతినిధుల 'సిఫారసు' కోసం ఆరాటం



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/మంచిర్యాలక్రైం: పోలీసు కమిషనర్ నుంచి, డీసీపీ, ఏసీపీస్థాయి అధికారుల వరకు బదిలీలు పూర్తయ్యాయి. ఎన్నికలకు ముందు పోలీసు శాఖలో కింది స్థాయిలో కీలకంగా వ్యవహరించే సీఐ, ఎస్సైల బదిలీలు కూడా త్వరలోనే జరుగుతాయన్న సంకేతాలు వెలువడుతున్నాయి. దీంతో జిల్లా పోలీస్ శాఖలో హడావుడి మొదలైంది. నచ్చిన స్టేషన్ కోసం సీఐలు, ఎస్సైలు ప్రయత్నాలు మొదలయ్యాయి. మరోచోట పోస్టింగ్ కోసం పైరవీల కోసం నేతల చుట్టూ తిరుగుతున్నారని తెలుస్తోంది.

జిల్లాలో ఇలా..

జిల్లా మొత్తం మూడు డివిజన్లలో 25 పోలీసు స్టేషన్లు ఉండగా, ఇందులో 12 మంది సీఐలు, 35 మంది వరకు ఎస్సైలు పని చేస్తున్నారు. వీరితోపాటు ఎస్బీ, టాస్క్‌ఫోర్స్, లూప్‌లైన్లలో ఉన్న వారు, పనిష్మెంట్ కింద అటాచ్ అయిన వారు ఇతర విభాగాల్లో పని చేస్తున్న అధికారులు పోస్టింగ్ కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు. ప్రస్తుతం పనిచేస్తున్న చోటు కన్నా మెరుగైన స్టేషన్ అన్ని రకాల 'వనరులు' ఉన్న చోట పోస్టింగ్ కోసం ఆరాటపడుతున్నారు. ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బదిలీలు అనివార్యం కావడంతో స్థానిక ప్రజాప్రతినిధుల మన్ననల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కొంతకాలంగా పోలీసు శాఖలో స్థానిక ఎమ్మెల్యేల 'సిఫారసు' లేఖ ఉంటేనే ఆయా స్టేషన్లకు పోస్టింగ్ ఇస్తున్నారు. ఈ క్రమంలో జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు, ఖానాపూర్(జన్నారం) పరిధిలో ఆయా ప్రజాప్రతినిధుల ఆశీస్సుల కోసం ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది.

ఈ స్టేషన్లకు డిమాండ్

జిల్లా కేంద్రంగా ఉన్న మంచిర్యాల పట్టణ స్టేషన్‌కు జిల్లాలో మంచి డిమాండ్ ఉంది. ఆ తర్వాత బెల్లంపల్లి, చెన్నూరుతోపాటు, మందమర్రి, లక్సెట్టిపేట, శ్రీరాంపూర్, తాండూరు స్టేషన్లకు ప్రాధాన్యత ఉంది. వీటి పరిధిలో కేసులు, హోదా, 'అన్ని రకాలు'గా బాగుంటుందనే చాలా మంది సీఐలు ఇక్కడ పని చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఇక పట్టణాల్లో ఉన్న స్టేషన్లు చూస్తే, రామకృష్ణాపూర్, నస్పూర్, రూరల్ పరిధిలోని జైపూర్, హాజీపూర్, కాసిపేట, జన్నారం స్టేషన్లు ఉన్నాయి. మిగతా చోట్ల నెన్నెల, భీమిని, కన్నెపల్లి, నీల్వాయి, కోటపల్లి తదితర ప్రాంతాలకు తర్వాత ప్రాధాన్యం ఇస్తున్నారు. ముఖ్యంగా సింగరేణి ప్రాంత స్టేషన్లకు వాటి స్థానాన్ని బట్టి డిమాండ్ ఉంది. దీంతో ఆ మేరకు అధికారులు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. అయితే ప్రజాప్రతినిధులు సైతం తమకు అనుకూలంగా ఉన్న అధికారులను, గత రికార్డు పరిశీలించాకే పైరవీ చేసేందుకు మొగ్గుచూపుతున్నారు. తమ ఆదేశాలు ధిక్కరించే వారిని దగ్గరకు కూడా రానివ్వడం లేదని తెలుస్తోంది.

ప్రయత్నాలు ముమ్మరం..

మంచిర్యాల స్టేషన్ కోసం ప్రస్తుతం నలుగురు సీఐలు పోటీ పడుతున్నారు. ఇక్కడ ఎస్‌హెచ్‌వో రావడానికి చాలా మంది ఉత్సాహం చూపుతున్నా నలుగురు ముందు వరుసలో ఉన్నారు. అయితే సిఫారసు లేఖ దక్కిన వారికే అవకాశం ఉండడంతో వీరిలో ఎవరిని వరిస్తుందో తేలాల్సి ఉంది. రామగుండం కమిషనరేట్ పెద్దపల్లి జోన్ పరిధిలో పని చేస్తున్న ఇద్దరు సీఐలు ఎలాగైనా ఈసారి జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు రావాలని ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అప్పట్లో జరిగిన బదిలీల్లో లాఅండ్‌ఆర్డర్ నుంచి వేరే విభాగానికి వెళ్లిన ఓ సీఐ మళ్లీ జిల్లాలో ఓ స్టేషన్‌లో పోస్టింగ్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. గతంలో కుమురంభీం జిల్లాలో పనిచేసి, ప్రస్తుతం జిల్లాలో పని చేస్తున్న ఓ సీఐ కూడా ప్రస్తుత స్థానం నుంచి మెరుగైన స్టేషన్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. చెన్నూరు నియోజకవర్గ పరిధిలో ఉన్న ఇద్దరు ఎస్సైలు సైతం పక్క నియోజకవర్గంలోకి మారాలని ప్రయత్నిస్తున్నారని పోలీస్ శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి. మారుమూల ప్రాంతంలో పని చేస్తున్న ఓ ఎస్సై ఈసారి ఎలాగైనా పట్టణ ప్రాంతానికి రావాలని ఇప్పటికే పైరవీ పట్టినట్లు తెలిసింది. ఓ స్టేషన్‌లో సీఐ, ఎస్సై మధ్య సఖ్యత లేని కారణంగా ఆ స్థానం నుంచి బదిలీ అయ్యేందుకు మరో అధికారి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతోపాటు ఖమ్మం, కరీంనగర్, వరంగల్ ప్రాంతాల నుంచి కూడా కొందరు జిల్లాకు వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

మే చివరి నాటికి సోలార్ ప్లాంట్ పూర్తి

- డైరెక్టర్(ఈఅండ్ఎం) సత్యనారాయణ



అధికారులతో మాట్లాడుతున్న సత్యనారాయణ

శ్రీరాంపూర్: చెన్నూర్‌లో మూసి వేసిన చెన్నూరు 2 ఇంక్లైన్ గని ఆవరణలో నిర్మిస్తున్న 11 మెగా వాట్ల సోలార్ పవర్‌ప్లాంట్ పనులు మే 31లోగా పూర్తి చేస్తామని సింగరేణి డైరెక్టర్(ఈఅండ్ఎం) డి.సత్యనారాయణ తెలిపారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో జీఎం సంజీవరెడ్డి ఇతర అధికారులతో ప్లాంట్ పనులపై శనివారం సమీక్ష నిర్వహించారు. కంపెనీ బొగ్గు ఉత్పత్తితోపాటు థర్మల్ విద్యుత్, ఇంకా సోలార్ రంగంలో కూడా అడుగుపెట్టిందని తెలిపారు. ఇందులో భాగంగా చెన్నూర్‌లో ఈ ప్లాంట్ నెలకొల్పుతున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్లాంట్ నుంచి వచ్చే విద్యుత్‌ను కిష్టంపూర్ వద్ద సబ్‌స్టేషన్‌కు అనుసంధానం చేస్తామని చెప్పారు. దీనికోసం ప్రతిపాదించిన విద్యుత్ లైన్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ రమేశ్‌బాబు, వర్క్‌షాప్ డీజీఎం చంద్రశేఖర్‌రెడ్డి, రీజినల్ సోలార్ ఇన్‌చార్జి శ్రీనివాస్, సివిల్ డీజీఎం శివరావు, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మి, ఎస్ఈ వర్క్‌షాప్ సతీశ్‌చక్రవర్తి, ఐటీ ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు(టీసీసీ) పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లా కేంద్రంలో జెడ్పీహెచ్(బాయ్స్), ప్రభుత్వ ఉన్నత పాఠశాల గర్మిళ్ల, జెడ్పీహెచ్ఎస్(గర్ల్స్) మూడు కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు 396 మందికి 178 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను డీఈవో వెంకటేశ్వర్లు పరిశీలించారు.

ట్రాక్.. ఆర్టీసీ!

- అరచేతిలో బస్సు వివరాలు
- స్మార్ట్‌ఫోన్‌లో పూర్తి సమాచారం
- హైదరాబాద్‌కు వెళ్లే బస్సులకే అమలు



బస్టాండ్‌లో సిద్ధంగా ఉన్న భద్రాచలం బస్సు



బస్సు ఎక్కడుందో తెలిపే మ్యాప్ ఇలా..

మంచిర్యాలఅర్బన్: రైలు ఎక్కడుందో.. మన స్టేషన్‌కు రావడానికి ఎంత సమయం పడుతుందో తెలుసుకునేందుకు ఇండియన్ రైల్వే పలు యాప్‌లను అందుబాటులోకి తెచ్చింది. ఇందులో రైళ్లకు సంబంధించిన సమగ్ర సమాచారం ఉంటుంది. అచ్చం ఇలాంటి పరిజ్ఞానాన్ని, సాంకేతికతను తాజాగా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కూడా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆర్టీసీ బస్సుల సమయం.. ఎక్కడి నుంచి వస్తుంది.. ఎంత సేపట్లో బస్టాండ్‌కు చేరుకుంటుందో ప్రయాణికులు తెలుసుకునేలా ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ట్రాకింగ్ సిస్టమ్ అందుబాటులోకి రావడంతో స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు.. బస్సుల రాకపోకల సమాచారం ప్రయాణికులు ఇట్టే తెలుసుకునే వీలు కలుగుతుంది.

వాహన ట్రాకింగ్‌తో...

బస్సు ఏ ఊరు దాటుకుని వచ్చింది.. ఏస్టేజీలో ఉంది.. అక్కడ ఎంత సేపు ఆగింది.. గమ్యస్థానానికి ఎన్ని గంటలకు చేరుకుంటుంది.. ఎన్ని కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది.. ఇలాంటి వివరాలు ట్రాకింగ్ ద్వారా తెలుసుకోవచ్చు. బస్సు ఏదైనా కారణంతో నిలిచిపోతే.. ఎక్కడ ఆగింది.. ఎంత సేపు ఆగింది అనే వివరాలతో పాటు సమస్య వచ్చి ఆగిందా.? డ్రైవర్ స్టేజీ వద్ద బస్సు నిలిపాడా.. అనే విషయాలు తెలుసుకునే వీలుంటుంది. బస్సు సంఖ్య, లేక సర్వీస్ నంబర్ తెలిస్తే ఆ బస్సు సమగ్ర సమాచారం సెల్‌ఫోన్‌లో పొందవచ్చు. అయితే ఈ పరిజ్ఞానాన్ని మొదట దూరప్రాంతాలైన హైదరాబాద్, భద్రాచలం, తిరుపతి, బెంగళూరు, షిర్డీ తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సుల సమాచారం మాత్రమే అందుబాటులోకి వచ్చింది.

యాప్‌లోకి వెళ్తే..

స్మార్ట్‌ఫోన్‌లో ప్లేస్టోర్‌లోకి వెళ్లి టీఎస్‌ఆర్టీసీ ట్రాకింగ్ యాప్ అని టైప్ చేసి డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్‌లోకి వెళ్లి బస్సు నిలుపు గమ్యాలు, దగ్గరగా స్టేజీలు, ఆయా ప్రాంతాల వివరాలు కనిపిస్తాయి. యాప్‌లో హైదరాబాద్ సిటీ కాకుండా డిస్ట్రిక్ట్ అనే దానిపై క్లిక్ చేసి బస్సు నంబర్, సర్వీసు నంబర్ నమోదు చేస్తే వివరాలు తెలుస్తాయి. ఇదే యాప్‌లో ప్రయాణికుడు రిజర్వేషన్ చేసుకునే సౌకర్యం కూడా ఉంది. సెర్చ్‌ఫర్ బస్‌స్టాప్స్ ఆప్షన్‌లో ప్రయాణికుడు ప్రయాణం చేస్తూ ఏదైనా బస్టాప్ కావాలంటే ఆ స్టాప్ పేరు నమోదు చేసి ఎంత దూరంలో ఉందో కూడా తెలుసుకోవచ్చు. సెర్చ్‌ఫర్ బస్ బిట్వీన్, ట్రాక్‌బస్‌బై సర్వీసు నంబర్, సెర్చ్ బై బస్ నంబర్, రిజర్వేషన్ బుక్ టికెట్‌లో టికెట్ బుక్ చేసుకోవచ్చు. ఎమర్జెన్సీ సేవలనూ ఇందులో పొందుపర్చారు. అత్యవసర సమయంలో బస్సు మార్గమధ్యంలో ఆగినా, ఏదైనా ప్రమాదం జరిగినా ఈయాప్‌తో సమాచారాన్ని పోలీస్, అగ్నిమాపకం, 108కు అందించవచ్చు. బస్సుకు కేటాయించిన సమయం కన్నా ముందు వచ్చినా.. ఆలస్యంగా వచ్చినా అనుమతిలేని ప్రదేశాల్లో నిలిపినా యాప్ చూపిస్తుంది.

ప్రయాణికులకు ఉపయోగం..

హైదరాబాద్ రూట్లలో బస్సుల్లో ట్రాకింగ్ సిస్టం అమల్లోకి వచ్చింది. ప్రయాణికులకు సమాచారం తెలుసుకోవటం సులువుగా ఉంటుంది. 15 రోజుల క్రితం టీఎస్ ఆర్టీసీ బస్ ట్రాకింగ్‌యాప్ అందుబాటులోకి తెచ్చింది. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి.

– రవీంద్రనాథ్, మంచిర్యాల డీఎం

రాజీ మార్గమే రాజ మార్గం

- జిల్లా న్యాయమూర్తి బి.సత్తయ్య
- లోక్ అదాలత్‌లో 2,392 కేసులు పరిష్కారం



మాట్లాడుతున్న న్యాయమూర్తి సత్తయ్య

మంచిర్యాలక్రైం: రాజీ మార్గమే రాజ మార్గమని జిల్లా న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ బి.సత్తయ్య అన్నారు. జాతీయ మెగా లోక్ అదాలత్‌ను జిల్లాలోని అన్ని కోర్టుల్లో శనివారం నిర్వహించారు. జిల్లా కోర్టులో సత్తయ్య మాట్లాడుతూ మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపెల్లి, లక్సెట్టిపేట కోర్టుల పరిధిలోని పెండింగ్‌లో ఉన్న కేసుల్లో ఇరువర్గాల రాజీతో 2,392 కేసులు పరిష్కారం అయ్యాయని తెలిపారు. ఇందులో బ్యాంకు కేసులు 38 ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కేసుల్లో జరిమాన రూపంలో రూ.40,64,869 చెల్లింపులు జరిగినట్లు తెలిపారు. కక్షిదారులు లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయాధికార సంస్థ కార్యదర్శి ఉదయ్‌కుమార్, న్యాయమూర్తులు మైత్రేయి, అర్పిత మారంరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రావు, ప్రధాన కార్యదర్శి రవీందర్, సీనియర్ న్యాయవాదులు భుజంగ్‌రావు, గంగయ్య, రవీందర్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

కేసులు సత్వర పరిష్కారం

చెన్నూర్: లోక్ అదాలత్‌లతో కేసులు సత్వరం పరిష్కారం అవుతాయని చెన్నూర్ మున్సిఫ్ కోర్టు జడ్జి మహతి వైష్ణవి అన్నారు. చెన్నూర్‌లోని మున్సిఫ్ కోర్టులో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో మొత్తం 410 కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. వివిధ రకాల వాహనాలకు జరిమానా విధించినవి 392, ఆయా కేసులలో కాంప్రమైజ్ అయినవి 18 కేసులు, బ్యాంకుకు సంబంధించినవి 20 కేసులు పరిష్కరించినట్లు పేర్కొన్నారు.

బెల్లంపల్లిలో 711 కేసులు పరిష్కారం..

బెల్లంపల్లి: బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టులో లోక్ అదాలత్‌లో 711 సివిల్, క్రిమినల్ కేసులు న్యాయమూర్తి జి.హిమబిందు పరిష్కరించారు. కేసుల పరిష్కారం కోసం కక్షిదారులు కోర్టుకు తరలిరావడంతో సందడిగా మారింది.

లక్సెట్టిపేటలో..

లక్సెట్టిపేట: స్థానిక మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో మంచిర్యాల జూనియర్ సివిల్ జడ్జి మహతి వైష్ణవి పలు కేసులు పరిష్కరించారు. క్రిమినల్ కేసులు 239, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కేసులు 40 సరిష్కరించినట్లు పోలీసులు తెలిపారు. సీనియర్ న్యాయవాది రాజేశ్వర్‌రావు కారుకూరి సురేందర్, అక్కల శ్రీధర్ పాల్గొన్నారు.

'తెల్ల'బోతున్న రైతులు



ఈ ఫొటోలోని రైతుపేరు తిరుమల్‌రావు. లక్సెట్టిపేట మండలానికి చెందిన ఈయన 16 ఎకరాల్లో పత్తి సాగుచేశాడు. అధిక వర్షాలు, తెగుళ్ల కారణంగా ఎకరాకు రూ.60 వేల వరకు పెట్టుబడి పెట్టాడు. అయినా దిగుబడి ఆశించిన మేరకు రాలేదు. రెండు నెలలుగా కూలీలతో పత్తి సేకరిస్తున్నాడు. అయితే ప్రస్తుతం మార్కెట్‌లో ధర లేకపోవడంతో సేకరించిన సుమారు 30 క్వింటాళ్ల పత్తిని ఇంట్లోనే నిల్వ చేసుకున్నాడు. పెట్టుబడి కోసం రూ.5 లక్షల వరకు అప్పు చేశాడు. దానికి వడ్డీ పెరుగుతోందని, పత్తి ధర మాత్రం పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. జిల్లాలో ఈ ఏడాది పత్తి సాగుచేసిన ప్రతీ రైతు పరిస్థితి ఇలాగే ఉంది.

- రైతుల ఇళ్లలోనే పత్తి నిల్వలు
- ధర గిట్టుబాటు కావడం లేదని అమ్మని రైతులు
- కొనుగోలుకు ముందుకురాని సీసీఐ



పత్తిని అమ్మకుండా అధిక ధర కోసం ఇంటిలోనే నిల్వ ఉంచిన పత్తి

లక్సెట్టిపేట: గతేడాది రైతుల ఇంట కాసుల వర్షం కురిపించిన తెల్లబంగారం(పత్తి) ఈసారి మార్కెట్ మాయాజాలంతో రైతును తెల్లబోయేలా చేస్తోంది. అధిక వర్షాలు, తెగుళ్లతో ఈఏడాది పత్తి పెట్టుబడి పెరిగింది. గతేడాది తరహాలోనే ధర ఉంటుందని భావించిన రైతులు పెట్టుబడికి వెనుకాడ లేదు. తీరా పంట చేతికి వచ్చాక ధర గిట్టుబాటు కావడం లేదు. అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ లేదని వ్యాపారులు ధర పెంచడం లేదు. దీంతో రైతులు ధర పెరగకపోతుందా అన్న ఆశతో ఇళ్లలోనే నిల్వ చేసుకుంటున్నారు. దాదాపు రెండు నెలలుగా పత్తి రైతుల గడప దాటడం లేదు. అధిక పెట్టుబడి పెట్టిన రైతులు ఇప్పుడు అమ్ముదామా, ఇంకా ఆగుదామా అన్న ఆలోచనలోనే ఉన్నారు.

జిల్లాలో నాలుగు పత్తి మార్కెట్లు..

జిల్లా ఈ ఏడాది 1.80 లక్షల ఎకరాల్లో పత్తి సాగుచేశారు. సుమారు 1.40 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. అధిక వర్షాలు, తెగుళ్ల కారణంగా పంటలు దెబ్బతినడంతో దిగుబడి తగ్గింది. ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వచ్చే పత్తి ప్రస్తుతం 6 నుంచి 8 క్వింటాళ్లే వచ్చింది. మరోవైపు పెట్టుబడి సాధారణంగా రూ.40 వేలు అయ్యేది. కానీ ఈ ఏడాది ఎకరాకు రూ.60 వేలు పెట్టుబడి పెట్టారు. ఈ ఏడాది ప్రభుత్వం పత్తి ధర రూ.6,380గా నిర్ణయించింది. సీజన్ ప్రారంభంలో మార్కెట్‌లో వ్యాపారులు క్వింటాల్‌కు రూ.9 వేలకుపైగా చెల్లించారు. దీంతో రైతులు సంతోషపడ్డారు. కానీ ఈ ఆనందం ఎన్నోరోజులు నిలవలేదు. అంతర్జాతీయంగా డిమాండ్ తగ్గిందని ధర తగ్గించుకుంటూ వచ్చారు. ప్రస్తుతం రూ.7 వేల నుంచి రూ.7,500 వరకు మాత్రమే చెల్లిస్తున్నారు.

సీసీఐ రాకుండా వ్యాపారుల ఎత్తుగడ..

మరోవైపు సీసీఐ పత్తిని కొనుగోలు చేయకుండా వ్యాపారులు ఎత్తుగడ వేస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధరకన్నా తక్కువ ఉన్నప్పుడే సీసీఐ కొనుగోళ్లు చేస్తుంది. దీంతో వ్యాపారులు మద్దతు ధరకంటే దిగువకు ధర పడిపోకుండా జాగ్రత్త పడుతున్నారు. సీసీఐ కొనుగోళ్లు చేయాలంటే పత్తి ధర మార్కెట్‌లో రూ.6,300 కంటే తక్కువ ఉండాలి. కానీ వ్యాపారులు క్వింటాల్‌కు రూ.6,500లకు తగ్గకుండా చూస్తున్నారు. దీంతో సీసీఐ కూడా కొనుగోళ్లకు ముందుకు రావడం లేదు. జిల్లాలో బెల్లంపల్లి, చెన్నూర్, ఇందారం, లక్సెట్టిపేటలో పత్తి కొనుగోళ్లు జరుగుతున్నాయి. అన్ని మార్కెట్లలోనూ కనిష్ట ధర రూ.6,500 గరిష్ట ధర రూ.7,500 మాత్రమే ఉంటుంది. ఇప్పటి వరకు ఆయా మార్కెట్లలో కలిపి 40 శాతం పత్తి మాత్రమే కొనుగోలు చేశారు.

ఎన్ని రోజులు నిల్వ ఉంచాలో తెలియని పరిస్థితి..

ఇక ఇళ్లలో నెలల తరబడి పత్తిని నిల్వ చేసిన రైతులు ఇలా ఇంకా ఎన్నిరోజులు నిల్వ చేయాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. రానున్న రోజుల్లో కూడా ధర పెరుగకపోతే పరిస్థితి ఏమిటన్న ప్రశ్న రైతులను టెన్షన్ పెడుతోంది. ఇప్పటికే పెట్టుబడి కోసం చేసిన ప్రైవేటు అప్పులు, బ్యాంకు రుణాలకు వడ్డీ పెరుగుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో దళారుల హవా నడుస్తుండడంతో ధర పెరుగుతుందో లేదో తెలియని పరిస్థితి. దీంతో కొంతమంది రైతులు అప్పులు తీర్చేందుకు ఇన్నాళ్లు నిల్వ చేసిన పత్తిని విక్రయిస్తున్నారు. ధర తక్కువ ఉన్నా విధిలేని పరిస్థితిలో అమ్ముతున్నామని పేర్కొంటున్నారు.

క్వింటాల్ పత్తి కూడా కొనలేదు..

జిల్లాలో నాలుగు చోట్ల సీసీఐ కేంద్రాలు ప్రారంభించాం. ప్రభుత్వ మద్దతు ధర రూ.6,300 క్వింటాల్ చొప్పున పత్తి కొనుగోలు చేస్తున్నాం. అయితే సీసీఐ ధరకంటే మార్కెట్ ధర రూ.500 నుంచి రూ.1000 ఎక్కువగా ఉండడంతో రైతులు సీసీఐకి కూడా పత్తిని అమ్మడం లేదు. దీంతో ఇప్పటి వరకు జిల్లాలో సీసీఐ కేంద్రాల్లో క్వింటాల్ పత్తి కూడా కొనలేదు. మార్కెట్ ధరపైనే రైతులు అసంతృప్తిగా ఉన్నారు. ధర పెరుగుతుందని ఎదురు చూస్తున్నారు. దీంతో ఇళ్లలోనే నిల్వ చేసుకుంటున్నారు.

– ఇనంగవోలు, సీసీఐ సీపీవో, లక్సెట్టిపేట

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు



ప్రజలతో మాట్లాడుతున్న ప్రేంసాగర్‌రావు

శ్రీరాంపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వానికి తెలంగాణలో నూకలు చెల్లాయని, రాష్ట్రంలో ఇక అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యుడు కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో హాథ్ సే హాథ్ జోడో అభియాన్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. పథకాలను గొప్పగా ప్రారంభించడం తప్ప అమలు చేసింది లేదన్నారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ మాట్లాడుతూ పక్కనే గోదావరి ఉన్నా తాగడానికి నీళ్లు లేవన్నారు. ప్రతీ వేసవిలో తమ ట్రస్ట్ ద్వారా తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. ఏటా ఆడపడుచులకు బతుకమ్మ చీరలు, ముస్లిం, క్రైస్తవులకు రంజాన్, క్రిస్మస్ సందర్భంగా నూతన వస్త్రాలు అందిస్తున్నామని వివరించారు. కరోనా సమయంలో రాజకీయాలకు అతీతంగా కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. నియోజకవర్గంలో ప్రజలు కోరుకుంటున్న అభివృద్ధి జరుగాలంటే ప్రేంసాగర్‌రావు నాయకత్వం కావాలన్నారు. అనంతరం వార్డుల్లో తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సేవా కార్యక్రమాలకు సంబంధించిన న్యూఇయర్ క్యాలెండర్‌ను ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బండారి సుధాకర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుర్మిళ్ల వేణు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పెంట రజిత, మండల కార్యదర్శి శ్యామల, కౌన్సిలర్లు శ్రీపతి సుమతి, గెల్లు రజిత, బొద్దున సంధ్యారాణి, యూత్ నాయకులు సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

15 నుంచి రక్తదాన శిబిరాలు

మంచిర్యాలఅగ్రికల్చర్: తలసేమియా వ్యాధిగ్రస్తులు, దీర్ఘకాలిక రోగులు, అత్యవసర సేవల నిమిత్తం జిల్లాలోని రెవెన్యూ శాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి రక్తదాన శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ తెలిపారు. మొదట చెన్నూర్ తహసీల్దార్ ఆధ్వర్యంలో చెన్నూర్ పట్టణంలోని పాత మార్కెట్ కార్యాలయం ఆవరణలో నిర్వహించే రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. తర్వాత జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని వివరించారు. రక్తదానం చేయడం ద్వారా మనం ఆరోగ్యంగా ఉండడంతోపాటు తలసేమియా వ్యాధిగ్రస్తులు, దీర్ఘకాలిక రోగులు, ప్రమాదాలలో గాయపడిన వారు, గర్భిణులకు అత్యవసర సమయాల్లో రక్తాన్ని అందించి ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చని తెలిపారు. ఈ శిబిరాల్లో యువకులు, డీలర్లు, రెవెన్యూ సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు.

క్లుప్తంగా

మాజీ మావోయిస్టు ఆత్మహత్య


సమ్మయ్య(ఫైల్)

కోటపల్లి: మండలంలోని బోప్పారం గ్రామానికి చెందిన మావోయిస్టు పార్టీ మాజీ డిప్యూటీ దళ కమాండర్ కనకాల సమ్మయ్య(52) శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బోప్పారం గ్రామానికి చెందిన కనకాల సమ్మయ్య మావోయిస్టులో వివిధ హోదాలో పనిచేయగా 20ఏళ్ల క్రితం సమ్మయ్యతో పాటు అతడి భార్య సమ్మక్కను పోలీసులు అరెస్టు చేశారు. విడుదల అనంతరం భువనగిరి జిల్లాలోని మోటుకుంటలోని వ్యవసాయ క్షేత్రంలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సమ్మయ్య శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం మండలంలోని బొప్పారం గ్రామానికి తీసుకొచ్చారు. సమ్మయ్యకు ఇద్దరు పిల్లలున్నారు.

షాదీఖానా స్థలం ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో అక్రమంగా నకిలీ పట్టాలు సృష్టించి షాదీఖానా భూమిని ఆక్రమించుకున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లి మైనార్టీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం అక్రమార్కులపై చర్యలు తీసుకోవడానికి అధికారుల మనసు మార్చాలని కోరుతూ కాంటా చౌరస్తాలో బాబాసాహెబ్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షాదీఖానా భూమిని ఏటా కొంతమొత్తంగా ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. నకిలీ పట్టాలు సృష్టించి ఆక్రమణ చేయడం దారుణమన్నారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ శాఖల అధికారుల కు వినతి పత్రాలు అందజేసిన నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు అమానుల్లాఖాన్, ఎండి గౌస్, అఫ్సర్ బాబా, జహీర్, తన్వీర్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని గుండం లొద్దీ గ్రామానికి చెందిన బాల్‌రావ్ (21) శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108లో రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై ఎస్సై నాగనాథ్‌ను సంప్రదించగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

సీజన్‌కు ముందే నకిలీ దందా

- రూ.10లక్షల విలువచేసే పత్తివిత్తనాలు స్వాధీనం
- ఖరీఫ్ ముగియకముందే దందాకు తెర
- తాండూర్, భీమిని మండలాలే కేంద్రంగా..
- కాసులు కురిపిస్తున్న అక్రమదందా
- కొరవడిన పూర్తిస్థాయి నిఘా


తాండూర్: నకిలీ పత్తి విత్తనాలతో పట్టుబడిన నిందితులు (కింద కూర్చున్న వ్యక్తులు)

బెల్లంపల్లి: ఖరీఫ్ పత్తి సీజన్ ముగియక ముందే జిల్లాలో నకిలీ పత్తివిత్తనాల దందా ప్రారంభమైంది. ఎవరికీ అనుమానం రాకుండా ముందస్తు వ్యూహంతో కొందరు నకిలీ పత్తి విత్తనాల దందాకు తెర తీశారు. గుట్టుగా రైతులకు నకిలీ పత్తి విత్తనాలు అంటగట్టడానికి చేసిన యత్నాలను ముందస్తు చర్యలతో పోలీసులు రట్టు చేశారు. ఇంకా ఆఖరు దశ పత్తి సేకరణ జరగాల్సి ఉండగా, మద్దతు ధర లేక ఈపాటికే సేకరించిన పత్తిని మార్కెట్‌కు తీసుకువెళ్లక రైతులు ఇళ్లలో నిల్వ ఉంచారు. ఇదే క్రమంలో అక్రమార్కులు నకిలీ పత్తి విత్తనాల సరఫరాకు రంగం సిద్ధం చేసుకోవడం వెనుక పెద్ద ఎత్తున వ్యూహం పన్నినట్లుగా తెలుస్తోంది. శనివారం తాండూర్ మండలం బోయపల్లి బోర్డు వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు మాటు వేసి నకిలీ పత్తి విత్తనాలు రవాణా చేస్తున్న ముగ్గురు నిందితులను పట్టుకోగా మరో ఇద్దరు పారిపోయారు. ఈ ఘటనలో పోలీసులు రూ.10 లక్షల విలువ చేసే నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. బొలేరో వాహనం, కారును సీజ్ చేశారు.

తాండూర్, భీమిని మండలాలు కేంద్రంగా...

నకిలీ పత్తి విత్తనాల క్రయవిక్రయాలకు తాండూర్, భీమిని మండలాలు ప్రధాన అడ్డాలుగా మారినట్లు తెలుస్తోంది. గతంలో సైతం ఆయా మండలాల నుంచే రైతులకు నకిలీ విత్తనాలను సరఫరా చేసినట్లు ప్రచారం జరిగింది. రహస్య ప్రాంతాల్లో నిల్వ ఉంచి నమ్మకమైన వ్యక్తుల ద్వారా రైతులకు పత్తి విత్తనాలను చేర వేసి దందాను లాభసాటిగా చేసుకున్నారు. సీజన్ ప్రారంభంలో పోలీసు నిఘా ఉంటుందనే ఉద్దేశంతో ఈసారి పత్తి సీజన్ నడుస్తున్న క్రమంలోనే నకిలీ విత్తనాలను దిగుమతి చేసుకున్నట్లుగా తెలుస్తోంది. రహస్య ప్రాంతాల్లో విత్తనాలను భద్రపర్చి మంచిర్యాల ప్రాంత రైతాంగానికి సరఫరా చేసే క్రమంలో అనూహ్యంగా పోలీసులకు చిక్కినట్లుగా తెలుస్తోంది.

ఏ ప్రాంతం నుండి వచ్చాయో ...

నకిలీ పత్తి విత్తనాలు గుట్టుగా రహస్య ప్రాంతాలకు చేరుకోవడం విస్మయం కలిగిస్తోంది. అయితే ఈ విత్తనాలు ఏ ప్రాంతం నుంచి వచ్చాయో తెలియాల్సి ఉంది. రహస్య స్థావరం నుంచి వేరే మరో ప్రాంతానికి వాహనాల్లో రవాణా చేస్తూ పోలీసులకు చిక్కడం సర్వత్రా చర్చనీయాంశమైంది. నిషేధిత పత్తి విత్తనాలను అక్రమార్కులు మహారాష్ట్ర వైపు నుంచి తీసుకు వచ్చారా లేదా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకున్నారా అనేది తేలాల్సి ఉంది. అక్రమార్కులను అరెస్టు చేసి సమగ్రంగా విచారణ చేస్తే కానీ పూర్తి వివరాలు వెలడయ్యే అవకాశాలు కానరావడం లేదు. నిత్యం నిఘా ఉన్నా కూడా అక్రమార్కులు దర్జాగా నకిలీ విత్తనాలను దిగుమతి చేసుకుని రహస్య స్థావరం నుంచి మరో ప్రాంతానికి రవాణా చేయడానికి సిద్ధపడడం సాధారణ విషయం కాదంటున్నారు పలువురు.

తిలాపాపం తలాపిడికెడు...

ప్రభుత్వ నిషేధిత పత్తి విత్తనాల క్రయ విక్రయాలు చేయడం నేరం. కానీ ఈ దందా అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. నకిలీ దందాను అరికట్టాల్సిన కొందరు అధికారులు అక్రమార్కులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలను కొంతకాలం నుండి మూటగట్టుకుంటున్నారు. ఒకరిద్దరు అధికారులు వ్యవహరిస్తున్న తీరు మరింత అనుమానాలను రేకెత్తిస్తోంది. అడపాదడపా నకిలీ విత్తనాలు పట్టుకుని ఉన్నతాధికారులకు అనుమానాలు కలుగకుండా చాకచక్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొత్తంగా పరిశీలిస్తే కొందరు అధికారుల లోపాయికారీ తనం అక్రమార్కులకు కలిసి వస్తున్నట్లుగా తెలుస్తోంది. ఏటా నకిలీ దందా నిరాటంకంగా సాగుతుండడం ఇందుకు నిదర్శనం అంటున్నారు పలువురు రైతులు.

నిషేధిత పత్తి విత్తనాలు పట్టివేత

- టాస్క్‌ఫోర్స్ పోలీసుల తనిఖీల్లో గుర్తింపు
- మంచిర్యాల జిల్లా తాండూర్‌లో ఘటన
- రూ.10 లక్షలు ఉంటుందని అంచనా

తాండూర్(బెల్లంపల్లి): ప్రభుత్వం నిషేధించిన బీటీ–3 పత్తి విత్తనాలను బెల్లంపల్లి టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. తాండూర్ మండలం బోయపల్లి వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా నకిలీ విత్తనాలు పట్టుబడ్డాయి. టాస్క్‌ఫోర్స్ సీఐ అశోక్ కథనం ప్రకారం.. తాండూర్ గ్రామ శివారు ప్రాంతం నుంచి కొంతమంది వాహనాల్లో నిషేధిత బీటీ–3 పత్తి విత్తనాలు అక్రమంగా రవాణా చేస్తున్నట్లు పక్కా సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన టాస్క్‌ఫోర్స్ పోలీసులు బోయపల్లి వద్ద మాటు వేశారు. అనుమానాస్పదంగా కనిపించిన బొలేరో, కారును ఆపి తనిఖీ చేశారు. ఈ వాహనాల్లో 5 క్వింటాలళ్ల నిషేధిత పత్తి విత్తనాలు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకుని ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు పారిపోయారు. నిషేధిత విత్తనాల విలువ రూ.10 లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. అదుపులోకి తీసుకున్నవారు శ్రీరాముల నవీన్ (రేచిని గ్రామం, తాండూర్ మండలం), ఒడ్నాల రాకేశ్(కొమురవెల్లి, రెబ్బెన మండలం), మోర్ల వెంకటస్వామి (భీమిని) అని తెలిపారు. కొడిపాక రంజిత్‌కుమార్, గాండ్ల మహేశ్(రేచిని గ్రామం, తాండూర్ మండలం) చాకచక్యంగా తప్పించుకున్నారు. నకిలీ పత్తి విత్తనాల రవాణాకు వినియోగించిన బొలేరో, కారు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. నిందితులు ఎవరికీ అనుమానం రాకుండా వాహనాల్లో వడ్ల బస్తాలు ఉంచి అడుగున నిషేధిత పత్తి విత్తనాలను తరలిస్తున్నారని తెలిపారు.

అధిక ధరకు అమ్మేందుకు తీసుకువెళ్తూ..

నకిలీ పత్తి విత్తనాలను ఇతర ప్రాంతాల రైతులకు అధిక ధరకు అమ్మేందుకు తీసుకెళ్తున్నట్లు పోలీసులకు పట్టుపడిన శ్రీరాముల నవీన్, ఒడ్నాల రాకేశ్, మోర్ల వెంకటస్వామి అంగీకరించారు. వీటిని రేచిని గ్రామానికి చెందిన రంజిత్‌కుమార్, గాండ్ల మహేశ్ వద్ద కొనుగోలు చేసినట్లు తెలిపారు. నిందితులను తాండూర్ పోలీసులకు అప్పగించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. తనిఖీల్లో ఎస్సై లచ్చన్న, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానిత ప్రాంతాల్లో సోదాలు


కల్వర్టులను తనిఖీ చేస్తున్న పోలీసులు

వేమనపల్లి: మావోయిస్టు ప్రభావిత అనుమానిత ప్రాంతాల్లో కోటపల్లి రూరల్‌సీఐ విద్యాసాగర్, నీల్వాయి ఎస్సై గోపతి నరేష్ ఆధ్వర్యంలో శనివారం ముమ్మర సోదాలు నిర్వహించారు. నాగారాం ఫారెస్ట్ రోడ్డు గుండా ఆర్‌ఓపీ నిర్వహించారు. మంగెనపల్లి, నాగారాం, వేమనపల్లి గ్రామాల పరిధిలోని వంతెనలు, కల్వర్టులు తనిఖీలు చేశారు. అనుమానిత ప్రాంతాల వెంట రాకపోకలు సాగిస్తున్న వ్యక్తులపై నిఘా ఉంచారు. కొత్త వ్యక్తులు తారసపడితే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ తనిఖీల్లో పోలీసులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన లారీ


ప్రమాదానికి గురైన లారీ

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద సిమెంట్ లారీ డివైడర్‌ను ఢీకొట్టింది. దేవపూర్ నుంచి సిమెంట్ లోడ్‌తో వరంగల్‌కు వెళ్తున్న లారీ బస్టాండ్ వద్దకు రాగానే డ్రైవర్ జంగన్న డివైడర్‌ను ప్రమాదవశాత్తు ఢీకొన్నాడు. దీంతో లారీ కింది భాగం ధ్వంసమైంది. డీజిల్‌ట్యాంక్ కూడా పగిలి కిందపడిపోయింది. ఈ ఘటనలోఎవరికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు. రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో సరైన సూచనలు ఏర్పాటు చేయక పోవడంతో తరచు ఇలాంటి రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొన్నారు. పోలీసులు ట్రాఫిక్‌ను క్లీయర్ చేశారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలోని ఇందిరమ్మ డెమో ఇంటిలో బెల్లంపల్లి పట్టణానికి చెందిన ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలు ఏరుకుంటూ జీవనం సాగిస్తున్న పంబాల రాకేష్ (30) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. ఎస్సై రమేష్ వివరాల ప్రకారం... కొంతకాలంగా పంబాల రాకేష్, స్వప్నలు ఇందిరమ్మ డెమో ఇంటిలో నివాసముంటున్నారు. గురువారం స్వప్న తన బంధువుల పెద్దకరమ్మ కార్యక్రమానికి వెళ్లి శుక్రవారం తిరిగి వచ్చి చూసే సరికి రాకేశ్ మృతిచెంది ఉన్నాడు. గత కొంతకాలంగా రాకేశ్ మద్యానికి బానిసై అనారోగ్యానికి గురయ్యాడు. ఇంట్లో ఎవరు లేకపోవడంతో తిండిలేక మృతిచెంది ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తుమ్మల దేవరావ్‌కు 'గుర్రం జాషువా' పురస్కారం


అవార్డు స్వీకరిస్తున్న తుమ్మల దేవరావ్

నిర్మల్‌చైన్‌గేట్: విమలశాంతి, పాలపిట్ట సంయుక్తంగా నిర్వహించిన గుర్రం జాషువా సాహితీ కవితా పురస్కారాన్ని నిర్మల్‌కు చెందిన ప్రముఖ కవి తుమ్మల దేవరావ్‌కు శనివారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో అందజేశారు. ఆయన రచించిన 'పొద్దున' కవితకు ఈ పురస్కారం లభించింది. ఆచార్య కొలుకలూరి ఇనాక్, నిఖిలేశ్వర్, ప్రొఫెసర్ జీవి రత్నాకర్, బిక్కి కృష్ణ, కోయికోటేశ్వర్ రావ్, డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, విమలశాంతి సంస్థ వ్యవస్థాపకులు జల్ది విద్యాధర్‌రావు ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా కవులు డాక్టర్ దామెర రాములు, డాక్టర్ చక్రదారి, పత్తిశివ ప్రసాద్, నెరేళ్ల హన్మంతు, అబ్బడి రాజేశ్వర్ రెడ్డి అభినందించారు.

జ్యోతి మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి


నివాళులర్పిస్తున్న సింగరేణి విశ్రాంత ఉద్యోగులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ ఎన్. బాలకృష్ణ భార్య జ్యోతి మృతికి కారకుడయ్యాడని, అతడిని విధుల నుంచి తొలగించి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని సింగరేణి విశ్రాంత కార్మికులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శనివారం జ్యోతి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సింగరేణి విశ్రాంతి కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, నాయకులు గూడ రాజురెడ్డి, మామిడాల సత్యనారాయణ, తుమ్మల శ్రీనివాసరెడ్డి, బోసు, ఇట్టెం రాజయ్య, అడిచెర్ల రాజేశం, పోశయ్య పాల్గొన్నారు.

జాతీయ సమావేశానికి ఏఐటీయూసీ నేతలు

శ్రీరాంపూర్: జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జరుగుతున్న జాతీయ స్థాయి కోల్‌ఫెడరేషన్ సబ్ కమిటీ సమావేశానికి తెలంగాణ నుంచి ఏఐటీయూసీ నేతలు హాజరయ్యారు. శనివారం ఈ సమావేశాలకు ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వి. సీతారామయ్య, డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు కె.రాజ్‌కుమార్, ఎస్కే బాజీసైదా, కె.వీరభద్రయ్య, కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య, నాయకులు ఎస్ఆర్ సీరెడ్డి హాజరయ్యారు.

20న ఐటీడీఏ కార్యాలయం ముట్టడి

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న ఐటీడీఏ ఉట్నూర్ ముట్టడి కార్యక్రమం చేపట్టినట్లు ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) జిల్లా అధ్యక్షుడు గోడం గణేష్ అన్నారు. శనివారం సంఘ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర అధ్యక్షుడు బుర్నా పోచయ్య ఆదేశాల మేరకు రాష్ట్ర కమిటీ సూచనతో ఈ ముట్టడి చేపడుతున్నామన్నారు. చట్టబద్ధతలేని లంబాడీలను ఎస్టీ జాబిత నుంచి తొలగించే వరకూ ఉద్యమిస్తామన్నారు. ఇతర కులాలను ఎస్టీ జాబితాలో కలుపవద్దని, ఆదివాసీలు సాగుచేస్తున్న అటవీ భూములకు ఎలాంటి షరతులు, తీర్మానాలు లేకుండా హక్కుపత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేసా, 1/59, 1/70 చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. 5వ షెడ్యూల్ ప్రాంతంలో ప్రభుత్వ 29 శాఖల్లోని జీవోలను అమలు చేయాలని, గిరివికాసం పథకం కింద ఆదివాసీ రైతుల వ్యవసాయ పొలాల్లో బోరు బావులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా, మండల కేంద్రాల్లో నివాసం ఉంటున్న ఆదివాసీలకు ఇంటి స్థలాలు వెంటనే మంజూరు చేయాలన్నారు. జీవో ఎంఎస్ 3ని యథావిధిగా అమలు చేయాలని, గిరిజన యూనివర్సిటీని ఆదిలాబాద్ జిల్లాలోనే ఏర్పాటు చేయాలని, జీవో ఎంఎస్ 317ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్పెషల్ డీఎస్సీ వేసి ఆదివాసీ యువతి, యువకులకు ఉద్యోగ అవకాశాలను కల్పించాలన్నారు. నాన్ ఏజెన్సీ ఆదివాసీ గ్రామాలను ఏజెన్సీ గ్రామలుగా గుర్తించాలని కోరారు. దళితబంధు మాదిరిగానే ఆదివాసీలకు ఆదివాసీ బంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తదితర డిమాండ్లతో చేపడుతున్న ఐటీడీఏ ముట్టడికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కమిటీ సభ్యులతో పాటు మండలంలోని అన్ని సంఘాలు, ఆదివాసీ నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

'బీసీలు అన్నిరంగాల్లో రాణించాలి'


మాట్లాడుతున్న పరిశోధకుడు కిషన్

పాతమంచిర్యాల: బీసీలు అన్ని రంగాల్లో రాణించాలని ప్రముఖ పరిశోధకులు ఇట్యాల కిషన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో తెలంగాణ బీసీ జాగృతి ఆధ్వర్యంలో బీసీ బడి పొలిటికల్ వర్క్‌షాప్‌ను శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ బీసీ జాగృతి జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్, ప్రముఖ పరిశోధకులు ఇట్యాల కిషన్ మాట్లాడారు. మహాత్మా జ్యోతిభాపూలే సావిత్రిబాయి పూలే, ఛత్రపతి సాహు మహరాజ్ , పెరియార్ రామస్వామి అడుగుజాడల్లో నడవాలన్నారు. బీసీ ఉద్యోగుల సంఘం ఫోరం రాష్ట్ర కన్వీనర్ సుంకరి రమేష్, పరిశోధకులు ఇట్యాల కిషన్, మున్సిపల్ ఉద్యోగుల సంఘం నాయకులు జన్మోహన్, మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేష్‌గౌడ్, సీనియర్ బీసీ నాయకులు అత్తి సరోజ, ఏఎంసీ చైర్మన్ తోట భూమేష్, నస్పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, బీసీ నాయకులు బోరిగం రాజారాం, బీసీ జాగృతి పట్టణ అధ్యక్షుడు మడుపు రాంప్రకాష్, ఉపాధ్యక్షుడు బొలిశెగళ్ళ లక్ష్మణ్, యువ జాగృతి అధ్యక్షుడు మంచర్ల సదానందం పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత, సమగ్రత సీపీఐ లక్ష్యం


మాట్లాడుతున్న కలవేన శంకర్

బెల్లంపల్లి: జాతీయ సమైక్యత, సమగ్రత లక్ష్యంగా సీపీఐ పని చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణి శంకర్ అన్నారు. శనివారం బెల్లంపల్లి సీపీఐ కార్యాలయంలో జరిగిన సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొడుతోందని విమర్శించారు. రాష్ట్రంలో ఆ పార్టీ క్రమంగా విషబీజాలు నాటే ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఆ యత్నాలను లౌకిక, ప్రజాస్వామిక శక్తులు అడ్డుకోవాలని లేకపోతే పెను సవాళ్లను చవి చూడాల్సి వస్తుందని అన్నారు. మతోన్మాదం వేళ్లూనుకోకుండా కట్టడి చేయాల్సిన బాధ్యత ప్రజాస్వామిక శక్తులపై ఉందన్నారు.

ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదు

సీపీఐ పార్టీని అవహేళన చేస్తూ అభ్యంతర కరంగా బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడటం తగదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ అన్నారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో సీపీఐకి వెయ్యి ఓట్లు కూడా రావని ఎమ్మెల్యే చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆసిఫాబాద్, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజవ వర్గాల నుంచి పోటీ చేసి సీపీఐ అభ్యర్థి గుండా మల్లేష్ నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారని గుర్తు చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్, జిల్లా నాయకులు మేకల దాసు, ఎం.వెంకటస్వామి, దాగం మల్లేష్, ఎం.శ్రీనివాస్, చిప్ప నర్సయ్య, జోగుల మల్లయ్య, బియ్యాల ఉపేందర్, డీఆర్ శ్రీధర్, జీసీ మాణిక్యం, బొంతల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వేసవిలో పశుగ్రాసాల సాగు

- పశుగ్రాసం కొరత ఉంచకూడదు
- అందుబాటులో ఎస్ఎస్‌జీ గడ్డి జొన్న విత్తనాలు
- జిల్లాలో మొత్తం 20 మెట్రిక్ టన్నుల విత్తనాలు


గడ్డిజొన్న

చెన్నూర్‌రూరల్: వరికోతకు కూలీలు సరిగా దొరకక రైతులు యంత్రాలను వినియోగిస్తుండడంతో వరిగడ్డి సరిగా రావడం లేదు. దీంతో పశువులకు వేసవిలో పశుగ్రాసం కొరత ఏర్పడుతోంది. వేసవిలో గడ్డిజొన్న సాగుచేస్తే పశుగ్రాసం కొరతకు చెక్ పడనుంది. పశుగ్రాసం సాగు చేసే రైతులకు ప్రస్తుతం గడ్డిజొన్నలో ఎస్ఎస్‌జీ –898 రకం విత్తనాలు 75శాతం సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

గడ్డిజొన్నలో రకాలు...

మంచిర్యాల జిల్లాలో మొత్తం 2.90లక్షల పశువులు ఉండగా, ఇందులో తెల్లజాతి (ఆవులు, ఎద్దులు)) 1.80 లక్షలు ఉండగా, గేదెలు 1.10లక్షలు ఉన్నాయి. అలాగే గొర్రెలు 5.50 లక్షలు, మేకలు 2లక్షలు ఉన్నాయని, రైతులు బహువార్షిక పశుగ్రాసాలు సాగు చేసుకోవచ్చు. ఇందులో ఏక వార్షిక గడ్డి జొన్న సాగు చేస్తే ఏడాది పాటు పశువులకు గ్రాసం లభిస్తుంది. విత్తనాలు విత్తిన 45 రోజులకు ఈ గడ్డిజొన్న కోతకు వస్తుంది. కోత కోసి పశువులకు మేతగా వేసిన తర్వాత మళ్లీ పిలకలు వచ్చి మొక్కలు ఎదుగుతాయి. ఇలా ఏడాది పాటు పశుగ్రాసం లభించనుంది. ప్రభుత్వం సబ్సిడీపై అందించే గడ్డిజొన్న విత్తనాలే కాకుండా దుకాణాలలో ఇతర గడ్డిజొన్న రకాల విత్తనాలు సైతం లభిస్తున్నాయి. బహు వార్షికాలలో హైబ్రీడ్ నేపియర్, కోరాన్, కో2, కో3, కో4, గన్ని గడ్డి, అంజన్‌గ్రాస్ రకాలు సైతం అందుబాటులో ఉన్నాయి. ఈ విత్తనాలు కాకుండా మొక్కలను లేదా కాండపు పిలకలను భూమిలో నాటాల్సి ఉంటుంది. నీటి వసతి ఉన్న అన్నీ భూముల్లో ఈ పశుగ్రాసాల సాగు చేసుకోవచ్చు. ఈ పశుగ్రాసాలు మొదటి కోత కోసిన తర్వాత ప్రతి 40–45 రోజులకు ఒక కోత చొప్పున సంవత్సరంలో 7–8 కోతలు పొందవచ్చు. యాజమాన్య పద్ధతులు పాటిస్తూ పశుగ్రాసాలను సాగు చేసుకుంటే వేసవిలో కూడా పశువులకు పశుగ్రాసం కొరత తీర్చవచ్చు.

జిల్లాలో పశువుల వివరాలు...

ఆవులు, ఎద్దులు	లక్షా 80వేలు
గేదెలు	లక్షా 10వేలు
గొర్రెలు	5.50లక్షలు
మేకలు	2లక్షలు

ఎస్ఎస్‌జీ–898 రకం గడ్డిజొన్న విత్తనాలు ఇప్పటికే జిల్లాలో 40 మెట్రిక్ టన్నులు రైతులకు అందజేయగా, అదనంగా 20 మెట్రిక్ టన్నులు రైతుల కోసం ఆయా మండలాల్లోని పశువైద్యశాలల్లో అందుబాటులో ఉంచారు. ఈ రకం గడ్డిజొన్నను నాటిన తర్వాత పూతకు వచ్చిన గడ్డిని కట్ చేసుకోవాలి. అయిదు సార్లు గడ్డిని కట్ చేసుకోవచ్చు.

సబ్సిడీపై గడ్డిజొన్న విత్తనాలు..



వేసవిలో పశువులకు పశుగ్రాసం కొరత లేకుండా ఉండేందుకు ప్రభుత్వం 75 శాతం సబ్సిడీపై గడ్డిజొన్న విత్తనాలను అందిస్తుంది. ప్రస్తుతం ఎస్ఎస్‌జీ–898 రకం గడ్డిజొన్న విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. రైతులు పశువైద్యశాలల్లో సంప్రదించి ఈ విత్తనాలు తీసుకోవాలి. వేసవిలో పశుగ్రాసానికి కొరత లేకుండా రైతులు ఇలాంటి గడ్డిజొన్న విత్తనాలు సాగు చేసుకుంటే మంచిది. తక్కువ రోజులలో కోతకు వస్తాయి.

– డా. వై రమేశ్‌కుమార్, జిల్లా పశువైద్యాధికారి

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడి మృతి

ఎదులాపురం: పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ విజయ్‌కుమార్ వివరాల ప్రకారం... మహారాష్ట్ర కిన్వట్ తాలుకా తలాయిగూడకు చెందిన మల్గం సునీల్ (21) ఏ పని చేయకుండా జులాయిగా తిరుగుతూ మద్యానికి బానిసయ్యాడు. దీంతో తండ్రి లక్ష్మణ్ ఈ నెల 6న సునీల్‌ను మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన సునీల్ మద్యం మత్తులో పురుగుల మందుతాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. కోలుకున్న సునీల్‌ను శనివారం ఉదయం డిశ్చార్జ్ చేశారు. ఇంటికి రాగా శ్వాససరిగ్గా అడకపోవడంతో తిరిగి చికిత్స కోసం రిమ్స్‌కు తరలించారు.